TGTEL/25/A1907

# అమృత్ తెలంగాణ

తెలుగు దిన పత్రిక

సంపుటి: 01 సంచిక : 214 ఎడిటర్ : సింగిడి అమృత్, తెలంగాణ ఆదివారం.01.03.2026 పేజీలు : 8, వెల:రూ.2.00

PUBLISHED FROM ADILABAD,NIRAML,MANCHIRAL,KOMARAMBHEEM, ASIFABADKARIMNAGAR,JAGITIYALA,PEDAPALLI,JAI SHANKA BHUPALLI, NIZAMABAD,KAMAREDDY,MEDCHEL,HYDERABAD

రిపోర్టర్లు కావలెను

TGTEL/25/A1907 అమృత్ తెలంగాణ తెలుగు దిన పత్రిక

తెలుగులో రాయగల సమర్థత, సమాజం పట్ల అవగాహన ఉంటే చాలు.

తెలుగు రాష్ట్రాలలో సంచలనాలు సృష్టిస్తున్న

TGTEL/25/A1907 అమృత్ తెలంగాణ తెలుగు దిన పత్రిక

మీకు సరైన వేదిక... అన్ని జిల్లాల, మండలాల మరియు నియోజకవర్గాల పరిధిలో పనిచేసేందుకు అవకాశం కల్పిస్తోంది.

ఇంకెందుకు ఆలస్యం

9849973404, 6304156955

వాట్సాప్‌లో మీ బయోడేటాను పంపండి.

# ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక

హైదరాబాద్ : అమృత్ తెలంగాణ: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, అభివృద్ధి పనులు, ప్రజోపయోగ కార్యక్రమాలను ప్రజలకు మరింత చేరువ చేయాలనే సంకల్పంతో 'ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక' అనే కార్యక్రమాన్ని చేపట్టబోతున్నట్టు ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ప్రకటించారు. మార్చి 6 నుంచి జూన్ 12 వరకు 99 రోజుల పాటు ఈ ప్రణాళికను అమలు చేయాలని అన్ని శాఖల కార్యదర్శులు, ఉన్నతాధికారులను ఆయన ఆదేశించారు. తెలంగాణ నాలుగు కోట్ల ప్రజల పండుగైన రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని జూన్ 2న సంబురంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఈ వేడుకను పురస్కరించుకుని 'ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక' కార్యక్రమాన్ని బాధ్యతగా నిర్వర్తించాలని అధికారులకు సూచించారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు షెడ్యూలు ప్రకారం కార్యక్రమాలను విజయవంతం చేయాలని, అందుకవసరమైన ప్రణాళికను వెంటనే సిద్ధం చేసి ఆచరణలో పెట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక లోగో తయారు చేయాలని సీఎస్ రామకృష్ణారావును కోరారు. ఫైళ్ల క్లియరెన్స్‌తోపాటు ఆఫీసుల్లో పారిశుద్ధ్యం, పరిశుభ్రత డ్రైవ్ నిర్వహించాలని సూచించారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో శనివారం అన్ని శాఖల ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. సీఎస్ రామకష్ణారావు, డీజీపీ శివధర్‌రెడ్డితోపాటు ముఖ్యమంత్రి సలహాదారు వేంనరేందర్‌రెడ్డి, సీఎంవో అధికారులు, అన్ని శాఖల ముఖ్య కార్యదర్శులు, కార్యద ర్శులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. పరిపాలనలో అధునాతన సాంకేతిక నైపుణ్యాన్ని సమర్థంగా వినియోగించాలని ఈ సందర్భంగా సీఎం అధికారులకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, పౌర సేవలన్నింటినీ మరింత సులభతరం చేయాలని చెప్పారు. పాలనలో భాగంగా ఏ ఫైలు, ఏ ఆర్జీ ఎక్కడ ఉందనే విషయాన్ని దరఖాస్తుదారుడు సులభంగా తెలుసుకునే విధంగా ఒక విధానాన్ని రూపొందించాలని ఆయన సూచించారు. సమూల మార్పులతో సాంకేతిక సంస్కరణలను అమలు చేసేందుకు సీనియర్ ఐఏఎస్ జయేష్ రంజన్ అధ్వర్యంలో ప్రత్యేక కమిటీ వేయాలని



ముఖ్యమంత్రి ఆదేశించారు.

మూడు వారాల్లో కమిటీ తమ నివేదికను అందజేయాలని చెప్పారు. ప్రతి విభాగమూ ఈ-ఆఫీస్ విధానం, డిజిటల్ గవర్నెన్స్‌ను అమలు చేయాలని అన్నారు. అన్ని శాఖలకు సంబంధించిన డేటా నిల్వ చేస్తున్న పాత కాలం సర్వర్‌ల ను రాబోయే 20 సంవత్సరాలకు సరిపడేలా అప్ డేట్ చేసుకోవాలని ఆదేశిం చారు. హైదరాబాద్‌లో నిర్వహించిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌తో పాటు వరల్డ్ ఎకనమిక్ ఫోరం, విదేశీ పర్యటనలతో రాష్ట్రానికి దాదాపు రూ.8 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయనీ, ఇవన్నీ ఫలవంతమయ్యేలా కార్యదర్శులు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. ప్రజలు మార్పును స్వాగతిస్తున్నారనీ, అందుకే వరుస ఎన్నికల్లో ప్రభుత్వానికి మద్దతుగా నిలిచారని గుర్తు చేశారు. ఆ విశ్వాసాన్ని నిలబెట్టుకునేలా విధినిర్వహణలో పునరంకితం కావాలని చెప్పారు.

# కాళేశ్వరం కమిషన్‌ను రద్దు చేయండి





హైదరాబాద్ : అమృత్ తెలంగాణ:కాళేశ్వరం ప్రాజెక్టు అంశంపై నియమితమైన జస్టిస్ పి.సి.ఘోష్ కమిషన్‌ను రద్దు చేయాలంటూ మాజీ సీఎం కేసీఆర్ తరపు న్యాయవాది శుక్రవారం హైకోర్టులో వాదించారు. కమిషన్ ముందుగా తనను సాక్షిగా పిలిచిందనీ, ఆ తర్వాత ఆరోపణలపై వివరణ తీసుకోకుండానే బాధ్యుడిగా పేర్కొందన్నారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణం, నిర్వహణలో జరిగిన అవకతవకలపై విచారణ నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం 2024 మార్చి 14న జారీ చేసిన జీఓ 6 ద్వారా జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌ను ఏర్పాటు చేసిందని తెలిపారు. కమిషన్ రిపోర్టును ప్రభుత్వానికి సమర్పించింది. ఈ రిపోర్టును రద్దు చేయాలనీ, కమిషన్ ఏర్పాటు చట్ట వ్యతిరేకమని ప్రకటించాలని కోరుతూ కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు, రిటైర్డు ఐఏఎస్ అధికారి ఎస్‌కే జోషి, ఐఏఎస్ అధికారి స్మిత సబర్వాల్ వేసిన వేరు వేరు పిటిషన్లను చీఫ్ జస్టిస్ ఏకే సింగ్, జస్టిస్ మొహియుద్దీన్‌ల డివిజన్ బెంచ్ విచారించింది. సీనియర్ అడ్వొకేట్ శేషాద్రినాయుడు వాదిస్తూ, కమిషన్ ఆఫ్ ఎంక్వైరీస్ చట్టం కింద సెక్షన్ 4, 5 ప్రకారం కేసీఆర్‌ను సాక్షిగా విచారణకు హాజరు కావాలని కమిషన్ నోటీసులు ఇచ్చిందని తెలిపారు. ఇతరుల సాక్ష్యాల ఆధారంగా కమిషన్ పిటిషనర్లపై తుది నిర్ణయానికి వచ్చే ముందు సెక్షన్ 8బి, 8సి ప్రకారం ముందస్తు వివరణ కోసం నోటీసులు ఇవ్వలేదని చెప్పారు. సాక్షులను క్రాస్ ఎగ్జామ్ చేసే అవకాశం ఇవ్వలేదన్నారు. నివేదికలో ప్రాజెక్టు డిజైన్, టెండర్లు, కాంట్రాక్టర్ల ఎంపిక తదితర అంశాల్లో నాటి సీఎం కేసీఆర్‌ను బాధ్యుడిగా పేర్కొనడం ఏకపక్షమన్నారు. కేసీఆర్ వల్ల రూ.7,500 కోట్ల నష్టం జరిగినట్టు కమిషన్ ఒక నిర్ణయానికి రావడం చెల్లదని వాదించారు. పిటిషనర్‌పై ఆరోపణలు ఉంటే వాటికి చెందిన ఆధారాలు, సాక్ష్యాలను కమిషన్ ఇవ్వాలనీ, వివరణ తీసుకోవాలనీ, ఆరోపణలు చేసిన వారినీ, కేసీఆర్, ఇతర పిటిషనర్లు వేర్వేరుగా క్రాస్ ఎగ్జామ్ చేయాలనీ, ఈ అవకాశాలు కమిషన్ ఇవ్వకుండానే తుది రిపోర్టు ఇవ్వడం చెల్లదన్నారు. విచారణ మార్చి 2కు వాయిదా పడింది.

జర్నలిస్ట్ పాస్‌పోర్టు రద్దు కరెక్టే

రెండు వేర్వేరు పేర్లతో ఉన్న పాస్‌పోర్టులను చూపించిన ఘటనలో పాస్‌పోర్టు అధికారుల రద్దు నిర్ణయాన్ని సమర్థిస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును హైకోర్టు డివిజన్ బెంచ్ ఆమోదించింది.

# విత్తన రైతులకు న్యాయం చేయాలి



హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: విత్తన రైతులకు న్యాయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి తెలంగాణ జాగృతి అధ్యక్షులు కల్వకుంట్ల కవిత విన్నవించారు. హైదరాబాద్‌లో రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, సభ్యులతో కవిత సమావేశమయ్యారు. అందులో రైతు కమిషన్ సభ్యులు గోపాల్ రెడ్డి, భవానీ రెడ్డి, నడిగడ్డ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు గొంగళ్ల రంజిత్ కుమార్, కన్వీనర్ బుచ్చిబాబు, జాగృతి వర్కింగ్ ప్రెసిడెంట్ ఎల్. రూప్ సింగ్, ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి, రైతు జాగృతి అధ్యక్షులు నవీన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా కవిత మాట్లాడుతూ.. మన రాష్ట్రంలోని రైతులు 60 రకాల విత్తనాలను పండిస్తూ 'సీడ్ బౌల్ ఆఫ్ ఇండియా'గా తెలంగాణను చేసేందుకు కషి చేస్తున్నారన్నారు. అయితే, కాంట్రాక్టు ఫార్మింగ్ చట్టం విత్తన రైతులకు అమలు కావడం లేదని వాపోయారు. పత్తి విత్తన రైతులకు ఇచ్చే అడ్వాన్స్‌లకు వడ్డీ కట్టడం, రైతులతో భూములు రాయించుకోవడం దారుణమని ఎత్తిచూపారు. కరీంనగర్ లో వరి సీడ్ పండిస్తున్న రైతులకు ఎకరానికి 75 వేలు ఇస్తున్నారనీ, గద్వాల్‌లో మాత్రం పత్తి విత్తనాలు పండించే రైతులకు ఇవ్వడం లేదని ప్రస్తావించారు. పైగా, 250 గ్రాముల పత్తి విత్తనాలను తరుగు తీస్తున్నారని వాపోయారు. కరీంనగర్‌లో వరి సీడ్ పండించే రైతులకు ప్రొక్యూర్ చేసిన తర్వాత మిగిలిన వాటిని కమర్షియల్‌గా అమ్ముకునే ఫ్రీడమ్ ఉందనీ, ఆ హక్కు గద్వాల రైతులకు లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సీడ్ పత్తి ఆర్గనైజర్లు, మీడియేటర్లు రైతులను పట్టిపీడుస్తున్నారని వాపోయారు. ఆ రైతులకు కూడా రూ.75 వేలు ఇప్పించాలని డిమాండ్ చేశారు. సీడ్ ఫెయిల్ అయితే కంపెనీలే బాధ్యత వహించేలా నిర్ణయం తీసుకోవాలని కోరారు. గద్వాల్ జిల్లాలో 10 వేల మంది సీడ్ పత్తి రైతులకు రూ. 2 వందల కోట్ల బకాయిలు ఉన్న విషయాన్ని ప్రస్తావించారు. కోదండరెడ్డి మాట్లాడుతూ...కవిత ప్రతిపక్ష నాయకురాలిగా పనిచేస్తున్నదని కొనియాడారు. ప్రజా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకురావడం మంచి సాంప్రదాయమని చెప్పారు. గద్వాల పత్తి విత్తన రైతులకు న్యాయం చేసేందుకు క్షేత్రస్థాయిలో పర్యటించి కలెక్టర్ ఆధ్వర్యంలో అక్కడే సమావేశం నిర్వహిమన్నారు. ఆర్గనైజర్ల నుంచి వస్తున్న ఇబ్బందులను ప్రస్తావించారు. రూ.200 కోట్ల బకాయిల అంశాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్తామన్నారు. రైతుకు విత్తనంపై హక్కు కలిగించేలా కసరత్తు చేస్తున్నామన్నారు. విత్తన కంపెనీల పనితీరు బాగోలేదని విమర్శించారు. బీటీ విత్తనాలు, కలుపు మందులపై నిషేధం ఉందని గుర్తుచేశారు. ఎర్రజొన్న విత్తన రైతులు కూడా అలర్ట్‌గా ఉండాలని సూచించారు. తక్కువ నీటితో ఎక్కువ దిగుబడి వచ్చే పంటలపై రైతులు దృష్టిసారించాల న్నారు. కమిషన్ సభ్యులు గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ... ఆర్గానిక్, ప్రకృతి వ్యవసాయాలపై రైతులు మొగ్గు చూపాలని సూచించారు. ములుగు జిల్లాలో మొక్కజొన్న విత్తనోత్పత్తి చేసిన నష్టపోయిన రైతులకు దేశంలోనే తొలిసారిగా రూ.4 కోట్ల నష్టపరిహారం ఇప్పించిన విషయాన్ని గుర్తుచేశారు. దేశంలో మొదటి సారిగా విత్తనకంపెనీల నుండి 4 కోట్ల నష్టపరిహారం అందించాం.

# ప్రాజెక్టుల్లో సత్వరమే రెండోదశ పూడికతీత పనులు



హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: మట్టితో పేరుకుపోయిన ప్రాజెక్టులలో రెండోదశ పూడిక తీత పనులకు సత్వరమే శ్రీకారం చుట్టాలని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. వర్షాకాలానికి ముందే పూడికతీత పనులకు ఉపక్రమిస్తే, సమద్ధిగా నీటి నిల్వలు ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. మట్టితో పూడిపోయిన ప్రాజెక్టుల్లో నీటి సామర్థ్యం పూర్తిగా పడిపోవడంతో జాతీయ స్థాయిలో ఇది ప్రధాన సమస్యగా పరిణమించిందని గుర్తు చేశారు. జాతీయస్థాయిలో ఏర్పడ్డ ఈ సంక్షోభం నుంచి బయట పడి రైతాంగానికి నీటి భద్రత కల్పించేందుకు గాను కేంద్రం జాతీయస్థాయిలో తీసుకొచ్చిన పూడిక తీత విధానాన్ని తెలంగాణా ప్రభుత్వం అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి పూడిక తీత పనులకు అంకురార్పణ చుట్టిందని చెప్పారు. శుక్రవారం సాయంత్రం డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సచివాలయంలో నీటిపారుదల శాఖా అధికారులతో సమీక్ష నిర్వహించారు. నూతనంగా నీటిపారుదల శాఖా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన ఇ.శ్రీధర్, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, జాయింట్ సెక్రటరీ కె శ్రీనివాస్, ఇఎన్సీ రమేష్ బాబు తదితరులు ఇందులో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ చారిత్రాత్మక బాక్రా నంగల్ నుంచి తెలంగాణ రాష్ట్రంలో సుప్రసిద్ధ శ్రీరాంసాగర్ ప్రాజెక్టు వరకు మట్టితో పూడిపోయి నీటిసామర్థ్యం నిలువ లు పడి పోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రత్యేకించి శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో 120 టీఎంసీల్లో సామర్థ్యం నుంచి ఏకంగా 80 టీఎంసీలకు పడిపోయిందన్నారు. మట్టితో లేదా ఇసుక మేటలతో ప్రాజెక్టులు పడిపోయి నీటి సామర్థ్యం నిలువలు ఘోరంగా పడిపోయి ఇది జాతీయ స్థాయి సమస్యగా పరిణమించిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలతో సమన్వయం చేసుకుని ముందుకు పోవాలని ఆయన డిమాండ్ చేశారు.రాష్ట్రంలో ఇప్పటికే మొదటిదశలో చేపట్టిన పూడికతీత పనులు జాతీయస్థాయిలో మార్గదర్శకాలతోనే తెలంగాణ ప్రభుత్వం ముందుకు పోతున్న విషయాన్ని ఆయన గుర్తుచేశారు.పూడికతీత పనులకు అవసరమైన నిధులను సమకూర్చేందుకు రాష్ట్ర మంత్రివర్గం ముందు ప్రతిపాదనలు పెట్టనున్నట్టు వివరించారు. ఇప్పటికే రాష్ట్రంలో కొనసాగుతున్న పూడికతీత పనులను ఆయన ప్రస్తావిస్తూ పైలెట్ ప్రాజెక్ట్ కింద "కడెం" ప్రాజెక్టులో మొదటి దశ లో చెపట్టిన పూడిక తీత విజయవంతమైందన్నారు. ఇక్కడ పూర్తిగా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించినట్టు వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రాజెక్టులలో ఉండాల్సిన నీటి సామర్థ్యం నిలువలు, వర్షాల ఉధతికి వచ్చి చేరే నీటితో ఏర్పడ్డ నీటినిలువలు సమగ్రంగా అధ్యయనంచేసి అంతిమ ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అన్నారు.

# భూదాన్ భూములపై సమన్వయం అవసరం

హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: 'భూదాన్ భూముల వ్యవహారంలో జరుగుతున్న ప్రచారం పట్ల ఆవేశానికి లోనుకాకుండా కార్యకర్తలు సంయమనంతో వ్యవహరించాలని కోరుతున్నా. ఈ విషయంలో రాజకీయ ప్రేరేపిత వ్యక్తులపైనా, సోషల్‌మీడియాలో పోస్టులు పెడుతున్నవారిపైనా, యూట్యూబ్ జర్నలిస్టులపైనా కేసులు పెట్టాల్సిన అవసరం లేదు. పేదల పట్ల మన నిబద్ధత, మానవీయ కోణం రేపటి నాడు స్పష్టమయ్యాక వాళ్లు కూడా ప్రభుత్వ చర్యను సమర్థించాల్సిన పరిస్థితి వస్తుంది. భూదాన్ భూముల్లో అర్హులైన ప్రతి పేదకూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో గూడు ఇచ్చే బాధ్యత నాది. పేదల సంఘం ముసుగులో విలువైన ప్రభుత్వ భూమిని కొందరు వ్యక్తులు అన్యాక్రాంతం చేసి, పేదలను అడ్డు పెట్టుకుని సొమ్ము చేసుకుంటుంటే బాధ్యత గల ప్రభుత్వంగా చూస్తూ ఊరుకోదు. అక్రమార్కుల పై చర్యల విషయంలో ఎంత కఠినంగా ఉంటామో, పేదల విషయంలో అంతే మానవీయంగా ఉంటాం. వారికి ఇందిరమ్మ ఇండ్లు కట్టించి గృహప్రవేశం చేయించే బాధ్యతను నేను తీసుకుంటా' అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హామీనిచ్చారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆరేండ్లుగా భూదాన్ భూముల్లో కనీస సదుపాయాలు లేని దుర్భర పరిస్థితుల్లో పేదలు బతుకుతున్నారని ఎత్తిచూపారు. దోపిడీదారులు, భూకబ్జాదారుల మాటలకు లోనై ఆందోళన చెందొద్దని ప్రజలకు సూచించారు. పేదల సంఘం పేరుతో భూ దందాను కమ్యూనిస్టు పార్టీలు కూడా ఖండించాయని గుర్తుచేశారు. 'కలెక్టరేట్ పక్కనే ప్రభుత్వ స్థలంలో అమాయక పేదలకు నకిలీ పట్టాలిచ్చి వారితో గుడిసెలు వేయించి పేదల సంఘం పేరుతో లక్షలు రూపాయలు వసూళ్లు చేశారు. చుట్టు పక్కల ప్రయివేటు స్థలాల వారిపై దౌర్జన్యం చేస్తుంటే ప్రభుత్వం చట్ట ప్రకారం చర్యలు తీసుకుంది. దీనిని రాజకీయ దుమారంగా మార్చి పబ్బం గడుపు కోవాలని కొందరు చూస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నాలుగు న్నర లక్షల ఇందిరమ్మ ఇండ్లు కట్టే





ప్రభుత్వానికి వెలుగుమట్ల బాధితులకు ఇళ్లు కట్టించి ఇవ్వడం భారమా!?' అని పేర్కొన్నారు. ఖమ్మం నగరంలో పలు కాలనీల్లో వేలాది పేదలకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఇచ్చిన తమకు వెలుగుమట్ల భూదాన్ భూముల్లో గుడిసెలు వేసిన వారు భారం కాదని తెలిపారు.

# లిక్కర్ కేసులో ఆధారాల్లేవ్

న్యూఢిల్లీ :అమృత్ తెలంగాణ: దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో అవినీతికి సంబంధించి ఎటువంటి ఆధారాలు లేవని రౌస్ అవెన్యూ కోర్టు (సిబిఐ ప్రత్యేక న్యాయస్థానం) ప్రకటించింది. ఈ కేసులో నిందితులుగా ఉన్న ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్, మాజీ ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత, ఆమె ఆడిటర్ బుచ్చిబాబు, ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులు రెడ్డి కుమారుడు రాఘవరెడ్డి సహా మొత్తం 23 మందిపై నమోదైన కేసులను కొట్టివేసింది. వారందరిని నిర్దోషులుగా ప్రకటించింది. సరైన ఆధారాలే లేకుండానే వీరి పేర్లను కేసులో చేర్చారని ఆగ్రహం వ్యక్తం చేసింది. కేసు విచారణ సందర్భంగా సిబిఐ వ్యవహరించిన తీరును ప్రత్యేక న్యాయమూర్తి జితేంద్రసింగ్ తీవ్రంగా తప్పు పట్టారు.

# బాసర ఘాట్ వద్ద తృటిలో తప్పిన ప్రమాదం -- సమయస్ఫూర్తి తో మహిళ ప్రాణాలను కాపాడిన బాసర పోలీసులు





అమృత్ తెలంగాణ బాసర న్యూస్ అప్రమత్తతతో వ్యవహరించి మహిళ ప్రాణాలను కాపాడిన బాసర పోలీసులను ప్రత్యేకంగా అభినందించిన జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఈ రోజు బాసర లోని మొదటి ఘాట్, గోదావరి నది వద్ద తృటిలో ఓ పెను ప్రమాదం తప్పింది.నిజామాబాద్ జిల్లా చిన్నాపూర్ తాండ గ్రామానికి చెందిన అరుణాదేవి (32) గోదావరిలో స్నానం చేస్తుండగా అకస్మాత్తుగా లోతు నీటిలోకి జారిపడి మునిగిపోతుండగా యాత్రికులు గమనించారు. అక్కడ ఉన్న భక్తులు సహాయం కోసం కేకలు వేయడంతో వెంటనే అప్రమత్తమైన బాసర పోలీసులు, ఆలయ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని తక్షణ సహాయక చర్యలు ప్రారంభించారు. పరిస్థితి తీవ్రమవుతుండటంతో వెంటనే చీరలు, తాళ్లు విసిరి ఆమెను పట్టుకుని సమన్వయంతో బయటకు లాగి సురక్షితంగా రక్షించారు.బాసర పోలీసుల సమయస్ఫూర్తి, ధైర్యసాహసాలతో అరుణాదేవి ప్రాణాపాయం నుంచి బయటపడింది.ఈ ఘటనతో అక్కడి యాత్రికుల్లో కాసేపు ఆందోళన నెలకొన్నప్పటికీ, బాసర పోలీసుల వేగవంతమైన చర్యలతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. ప్రాణాలను కాపాడిన పోలీసు సిబ్బందిని అక్కడున్న భక్తులు కొనియాడారు.

ఈ సందర్భంగా లిజిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల మాట్లాడుతూ....

గోదావరి ఘాట్‌ల వద్ద విధుల్లో ఉన్న సిబ్బంది, అప్రమత్తతతో వ్యవహరించి ఘాట్ దగ్గరనిరంతరంగస్తీ కాస్తూ, ప్రాణాలనుకాపాడిన బాసర పోలీసులను, భైంసా ఏఎస్పీరాజేష్ మీనాఐపీఎస్,ఇన్స్పెక్టర్ కిరణ్ లను జిల్లా ఎస్పీ లిడా.జి.జానకి షర్మిల ప్రత్యేకంగా అభినందించారు.

# గోదావరి పుష్కరాల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై సమగ్ర సమీక్ష సమావేశం.




జగిత్యాల అమృత్ తెలంగాణ ఫిబ్రవరి 28: జగిత్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు, కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ , జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ మరియు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారూ ఈ సందర్భంగా కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ పలు సూచనలు చేశారు:

కోమటికొండపూర్, ఎర్దండి ప్రాంతాల్లో బ్యాక్వాటర్ ఉన్నందున భక్తుల సౌకర్యార్థం అక్కడ బోటింగ్ నదుపాయాలు కల్పించాలని కోరారు..వాల్గొండ గ్రామంలో దేవాలయ ప్రాంతంలో భోజనశాల ఏర్పాటు చేసి, ఆలయ అభివృద్ధి పనులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

పుష్కరాలకు భారీ సంఖ్యలో భక్తులు రానున్నందున తగిన సౌకర్యాలు, త్రాగునీరు, తాత్కాలిక మరుగుదొడ్లు, విశ్రాంతి మండపాలు ఏర్పాటు చేయాలని సూచించారూ ,మల్లాపూర్ మండలంలోని మొగిలిపేట, ఓబులాపూర్, సంగెం శ్రీరాంపూర్, కొత్త దామ్రాజ్పల్లి, పాత దామ్రాజ్పల్లి, వల్గొండ, గొర్రెపెల్లి, వి.వి.రావుపేట ఇబ్రహీంపట్నం మండలం లోని కోమటి కొండాపూర్ ఎర్ధండి తదితర ప్రాంతాల్లో ప్రత్యేక పుష్కర ఘాట్‌లు ఏర్పాటు చేయడంతో పాటు, పార్కింగ్ స్థలాలు, రహదారి సదుపాయాలు, శానిటేషన్ వ్యవస్థలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను కోరారు.

ఓబులాపూర్ గ్రామంలోని మల్లన్న స్వామి దేవాలయం మరియు లక్ష్మీ నర్సింహా స్వామి దేవాలయం సమీపంలో ఒక ప్రత్యేక పుష్కరఘాట్ ఏర్పాటు చేయాలని కోరారు.మొగిలిపేట గ్రామంలోని బండరేవు ప్రాంతంలో ఒక పుష్కరఘాట్ నిర్మాణం చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.అదేవిధంగా మహిళలు, వృద్ధులు, దివ్యాంగుల కోసం ప్రత్యేక సహాయక కేంద్రాలు ఏర్పాటు చేయాలని, ట్రాఫిక్ నియంత్రణకు సమర్థమైన ప్రణాళిక రూపొందించాలని, భద్రతా చర్యలను మరింత పటిష్టం చేయాలని సూచించారూ.

# ఇది ఉద్యోగం కాదు వ్యాపారం!

## సూపర్వైజర్లు, సీడీపీవోలు వివిధ పేర్లతో,అంగన్‌వాడీల్లో అక్రమ వసూళ్లు! సతమతం అవుతున్న టీచర్లు,ఆయాలు.



జగిత్యాల అమృత్ తెలంగాణ ఫిబ్రవరి 28: జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాల్లో గత ఆరు నెలలుగా అక్రమ వసూళ్లు జరుగుతున్నాయన్న ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. ఈ మేరకు ఏ ఐ టి యు సి జిల్లా శాఖ శుక్రవారం జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్‌కు లిఖితపూర్వక ఫిర్యాదు సమర్పించి, తక్షణ విచారణ చేపట్టాలని డిమాండ్ చేసింది. ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం సూపర్వైజర్లు, సీడీపీవోలు వివిధ పేర్లతో ఒక్కో అంగన్‌వాడీ సెంటర్ నుంచి పదివేలకు పైగా వసూళ్లు చేస్తున్నట్లు ఆరోపించారు. “ఏ కార్యక్రమం జరిగినా ఇంత ఇవ్వాల్సిందే” అంటూ టీచర్లు, ఆయాలను ఒత్తిడికి గురిచేస్తున్నారని బాధితులు వాపోతున్నారు. గతంలో ఆరోపణలు ఎదుర్కొని బదిలీ అయిన ఒక ఉన్నతాధికారి తన కూతురు వివాహం పేరుతో జగిత్యాల ప్రాజెక్టుల నుంచి రూ.10 లక్షలు, ధర్మపురి ప్రాజెక్టు నుంచి రూ.5 లక్షల ‘టార్గెట్’ పెట్టి వసూలు చేసినట్లు బాధితులు పేర్కొన్నారని ఫిర్యాదులో ప్రస్తావించారు. వేసవి సెలవుల్లో జీతాలు వచ్చాయని కారణం చూపుతూ ప్రతి సెంటర్ నుంచి టీచర్ నుంచి రూ.1000, ఆయా నుంచి రూ.500 చొప్పున రూ.1500 వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వం చెల్లించిన రూ.12 వేల బిల్లులపై ప్రతీ బిల్లుకు రూ.2000 చొప్పున వసూలు చేసినట్లు కూడా పేర్కొన్నారు.

అదనంగా బతుకమ్మ కార్యక్రమం పేరుతో ఒక్కో సెంటర్ నుంచి రూ.1500, దసరా మామూలు పేరుతో రూ.1000, జనవరి 1 బహుమతుల పేరుతో మరో రూ.1000 వసూలు చేసినట్లు ఆరోపించారు. డబ్బులు ఇవ్వని సిబ్బందిని బెదిరించి “టార్గెట్ చేస్తాం” అంటూ మానసిక ఒత్తిడి తెస్తున్నారని బాధితులు వెల్లడించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇంకా అర్హతలేమి ఉన్నప్పటికీ సూపర్వైజర్‌గా పనిచేస్తున్న మమతకు సీడీపీవోగా అదనపు బాధ్యతలు ఇవ్వడం వల్ల అనేక అక్రమాలు జరుగుతున్నాయని అంగన్‌వాడీ టీచర్లు ఆరోపిస్తున్నారని ఫిర్యాదులో స్పష్టం చేశారు. ఈ మొత్తం వ్యవహారంపై జిల్లా స్థాయిలో తక్షణ విచారణ జరిపి, సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ డిమాండ్ చేసింది. “సిబ్బందిపై ఒత్తిడి, అక్రమ వసూళ్లు నిలువరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతాం” అని యూనియన్ ప్రతినిధులు హెచ్చరించినట్లు సమాచారం. పిల్లల పోషకాహారం, మహిళల ఆరోగ్యానికి సంబంధించిన కీలకమైన అంగన్‌వాడీ వ్యవస్థలో ఇలాంటి ఆరోపణలు రావడం ప్రజల్లో ఆందోళన కలిగిస్తోంది.

ఈ అంశంపై అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలను సంప్రదించి వివరణ కోరగా, ఆరోపణల్లో వాస్తవం ఉందని వారు ఒప్పుకున్నారు. అయితే తమ పేర్లు వెల్లడిస్తే సంబంధిత అధికారులు తమపై తీవ్ర పరిపాలనా వేధింపులకు పాల్పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తూ, తమ వివరాలను గోప్యంగా ఉంచాలని విజ్ఞప్తి చేశారు. “ఇలాంటి వసూళ్లు మాకు కొత్తేమీ కాదు. చాలా కాలంగా వివిధ పేర్లతో డబ్బులు వసూలు చేస్తూ మమ్మల్ని ఒత్తిడికి గురిచేస్తున్నారు. ఇవ్వకపోతే టార్గెట్ చేస్తామని, మెమోలు ఇస్తామని, బదిలీలు చేస్తామని బెదిరింపులు వస్తుంటాయి” అని కొంతమంది సిబ్బంది ఆవేదన వ్యక్తం చేశారు. “మేము మా పనులు నిజాయితీగా చేస్తున్నాం. కానీ ఎప్పటికప్పుడు పై అధికారుల ఒత్తిళ్లు, డబ్బుల డిమాండ్లు మానసికంగా తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. మాకు న్యాయం జరగాలంటే ముందుగా మా భద్రతకు హామీ కావాలి” అని వారు పేర్కొన్నారు.

ఈ వాంగ్మూలాలు అంగన్‌వాడీ వ్యవస్థలో నెలకొన్న భయ వాతావరణాన్ని, సిబ్బంది ఎదుర్కొంటున్న మానసిక ఒత్తిడిని స్పష్టంగా సూచిస్తున్నాయి. జిల్లా యంత్రాంగం వెంటనే స్పందించి ఆరోపణల నిజానిజాలు బయటపెట్టి, బాధ్యులపై చర్యలు తీసుకుంటేనే సిబ్బంది నమ్మకం నిలబడుతుందని సామాజిక వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# జిల్లా వసతి గృహ సంక్షేమ అధికారుల సంఘ డైరీ ఆవిష్కరణ



జగిత్యాల అమృత్ తెలంగాణ ఫిబ్రవరి 28: జిల్లా వసతి గృహ సంక్షేమ అధికారుల సంఘ డైరీని,జగిత్యాల జిల్లా కేంద్రంలో జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కే రాజ్ కుమార్ జిల్లా బిసి వెల్ఫేర్ ఆఫీసర్ జి.సునీతతో కలిసి శనివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టి ఎన్ జి వోస్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు నరేందర్ రెడ్డి, ట్రెజరర్ ఎం డి సాజిద్ బాబా, సంక్షేమ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు కే శ్రీనివాస్ నాయక్, సెక్రటరీ వి రాజేష్, జిల్లా వసతి గృహ సంక్షేమ అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీరామనవమి ఉత్సవ కరపత్రం ఆవిష్కరణ.



జగిత్యాల అమృత్ తెలంగాణ ఫిబ్రవరి 28: జగిత్యాల విద్యానగర్ సీతారామచంద్రస్వామి దేవాలయంలో నిర్వహించనున్న శ్రీరామనవమి ఉత్సవాల కరపత్రాన్ని శనివారం దేవాలయం ఆవరణలో ఆవిష్కరించారు. మార్చి 26 నుండి 28 వరకు శ్రీరాముని ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ ఇనగంటి అశోక్ రావు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా మార్చి 26 గురువారం విశ్వక్సేన ఆరాధన, వాసుదేవ పుణ్యవచనం, రక్షాబంధన తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. మార్చి 27 శుక్రవారం చైత్ర శుద్ధ నవమి రోజున మధ్యాహ్నం పునర్వసు నక్షత్రంలో శ్రీ సీతారామ కళ్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు. మరునాడు శ్రీ స్వామివారి పట్టాభిషేక కార్యక్రమాన్ని నిర్వహిస్తామని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ అరవ లక్ష్మి రాజు, ధర్మకర్తల మండలి సభ్యులు డాక్టర్ గడ్డం వేణుగోపాల్ రెడ్డి, చుక్క మహేందర్, రుద్రంగి వేణుగోపాల కృష్ణ శర్మ, బట్టాజి వేణుగోపాల శర్మ, ఆలయ ఈవో సంగెం సురేందర్, ప్రధాన అర్చకులు రంజిత్ కుమార్ ఆచార్య తదితరులు పాల్గొన్నారు.

# బిన్ తిమ్మాపురం సమస్యలు పరిష్కరించాలి



భువనగిరి :అమృత్ తెలంగాణ: భువనగిరి మండలంలోని బి ఎన్ తిమ్మాపురం గ్రామ ప్రజా సమస్యలు భూ నిర్వాసితుల సమస్యలు ఆర్ అండ్ ఆర్ కాలనీ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సర్పంచ్ ఎడ్ల వెంకట్ రెడ్డి ఎమ్మెల్యే ని మర్యాదపూర్వకంగా కలిసి, ఘనంగా సన్మానించి గ్రామ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు ఎమ్మెల్యే కుంభ అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. బి ఎన్ తిమ్మాపురం గ్రామ భూ నిర్వాసితులు ఆర్ అండ్ ఆర్ కాలనీ ప్రజా సమస్యలు ప్రతి ఒక్కటి దృష్టిలో పెట్టుకొని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో చర్చించడం జరిగిందని తెలిపారు. త్వరలోనే భూ నిర్వాసితులకు అవార్డులకు సంబంధించిన బడ్జెట్ అందజేస్తామని అన్నారు.

నూతనంగా నిర్మిస్తున్న ఆర్‌ఎన్‌ఆర్ కాలనీ యొక్క సమస్యలు కూడా ఒక్కొక్కటిగా పరిష్కరించే దిశగా పనులు చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల పోరం అధ్యక్షులు పాశం శివానంద్, సర్పంచులు పాల్గొన్నారు.

# 3 నెలల పెండింగ్ వేతనాలు చెలించాలి. గ్రామపంచాయతీ సర్పంచ్, కార్యదర్శుల వేధింపులు ఆపాలి




ఐటిడిఎ పిఓ కు వినతి పత్రం అందజేస్తున్న సిఐటియు అదిలాబాద్ జిల్లా అధ్యక్షులు బొజ్జ ఆశన్న

అమృత్ తెలంగాణ ఉట్నూర్ న్యూస్ ITDA కార్యాలయంలో PO యువరాజ్ మర్మట్ గారికి గ్రామపంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలని వినతి పత్రం ఇవ్వడం జరిగింది . ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు బొజ్జ ఆశన్న మాట్లాడుతూ... గత మూడు నెలల నుండి గ్రామపంచాయతీ కార్మికులకు వేతనాలు ఇవ్వడం లేదు తమ కుటుంబాలను పోషించుకోవాలంటే చాలా ఇబ్బందిగా ఉంది కార్మికులు చాలీచాలని వేతనాలతో గ్రామపంచాయతీలో మల్టీపర్పస్ విధానం వల్ల అన్ని పనులు గ్రామాలలో చేస్తున్నారు కానీ రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల పట్ల మొండిగా వ్యవహరిస్తుంది కార్మికులు కోరేవీటి గొంతమ్మ కోరికలు కావు కార్మికులకు ఒకటో తారీకు లోగా వేతనాలు వెయ్యాలని డిమాండ్ చేశారు కార్మికులు తమ కుటుంబాన్ని కొనసాగించాలంటే చాలా ఇబ్బందిగా ఉన్నది.గ్రామ పంచాయతీ కార్మికుల న్యాయమైన డిమాండ్స్ 3నెలల పెండింగ్ వేతనాలు చెల్లిచాలి,కనీస వేతనం 26వేలు ఇవ్వాలి, మల్టిపార్పస్ విధానాన్ని రద్దు చెయ్యాలి, గ్రీన్ సిగ్నల్ ద్వారా కార్మికుల ఖాతాల్లో నేరుగా వెయ్యాలి.ఇతర డిమాండ్ లను పరిస్కారం చెయ్యాలని. కోరారు. అదే విదంగా గ్రామ పంచాయతీ లో, సర్పంచ్, కార్యదర్సులు కార్మికులను ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా కార్మికులను ఉద్యోగం నుండి తొలగిస్తున్నారు.గ్రామ పంచాయతీ లో మల్టివర్కర్స్ గా అన్ని పనులు చెయ్యాలి అని వేదిస్తున్నారు.వేధింపులు ఆగకపోతే రానున్నారోజుల సీఐటీయూ గా జిల్లా వ్యాప్తంగా ఆందోళన పోరాటాలు చేస్తాము అని డిమాండ్ చేశారు. తమరి ద్వారా సర్పంచ్,పంచాయతీ కార్యదర్సులకు నోటీసులు పంపగలరని కోరారు.

ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ యూనియన్ ఉట్నూర్ మండల అధ్యక్ష, కార్యదర్శి, ఆత్రం సోనేరావ్, ఆత్రం సుందర్, మండల కోశాధికారి అర్కా వెంకట్రావు, ఉపాధ్యక్షులు, పూర్కా ప్రభు,తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛంద సేవలో రాష్ట్రంలో ముందుండాలి: కలెక్టర్



భువనగిరి :అమృత్ తెలంగాణ: గ్రామీణ ప్రజలకు స్వచ్ఛంద సేవలు అందించడంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ యాదాద్రి భువనగిరి జిల్లా శాఖ రాష్ట్రంలోనే ముందుండాలని నూతన జిల్లా కలెక్టర్ అనురాగ జయంతి అన్నారు. శనివారం సాయంత్రం జిల్లా రెడ్క్రాస్ బృందం నూతన కలెక్టర్ ను కార్యాలయం లో కలిసి పుష్పగుచ్చం అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు .ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో రెడ్ క్రాస్ నిర్వహించే స్వచ్ఛంద కార్యక్రమాలలో తను భాగస్వామ్యం అవుతానని తెలిపారు. త్వరలో నిర్వహించనున్న రెడ్క్రాస్ జిల్లా సర్వసభ్య సమావేశంలోనూ తను పాల్గొంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ జి లక్ష్మీనరసింహారెడ్డి, వైస్ చైర్మన్ దిడ్డి బాలాజీ ,రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆర్ మహేందర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు సద్ది వెంకటరెడ్డి, జిల్లా డైరెక్టర్లు ,జంపాల అంజయ్య, ఎస్.ఎన్. చారి, డివిజన్ ప్రతినిధులు చంద్రశేఖర్, లావణ్య, యూత్ వింగ్ జిల్లా అధ్యక్షుడు బి సుమచ్చగిరి,కార్యాలయ కార్యదర్శి క్రిస్టోఫర్, ఉన్నారు.

# మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులకు సన్మానం..



ముధోల్ అమృత్ తెలంగాణ: నియోజకవర్గ కేంద్రమైన ముధోల్ ల్లో శనివారం ముధోల్ నియోజకవర్గం మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో ఇటీవల నూతనంగా ఎన్నికైన మున్నూర్ కాపు సామాజిక వర్గం చెందిన ప్రజాప్రతినిధులకు ఘనంగా సన్మానించారు .ఇటీవల ఎన్నికైన ఆయా ప్రాంతాలకు చెందినసర్పంచులకు, ఉపసర్పంచ్ లకు, వార్డు సభ్యులకు, కౌన్సిలర్లు, చైర్మన్లు కార్పొరేటర్లకు సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముధోల్ నియోజకవర్గ మున్నూర్ కాపు సంఘం అధ్యక్షులు రోళ్ల రమేష్, సంఘం నాయకుల ఆధ్వర్యంలో నిర్మల్ మున్సిపల్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి, బైంసా మున్సిపల్ చైర్మన్ టి. దత్తాద్రి కొండల్ వాడి మున్సిపల్ చైర్మన్ కోట్ల గజానంద్ ,నిజామాబాద్ కార్పొరేటర్ బొబ్బిలి వేణు, కౌన్సిలర్లు అల్లం దిలీప్, చింతపండు మహేష్, నిమ్మ ప్రవీణ్, రాజు, హరీష్,పాటు పలువురికి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి జి రవి, కోశాధికారి సిద్దుల వివేకానంద, సలహాదారులు పిప్పెర కృష్ణ,కోర్వ శ్యామ్, నరసయ్య, గడ్డం సుభాష్ ,లవన్ కుమార్ తో పాటు పెద్ద సంఖ్యలో సంఘం సభ్యులు ,తదితరులు, పాల్గొన్నారు.

# ప్రేరణ -- అవగాహన సదస్సు..



సారంగాపూర్ అమృత్ తెలంగాణ:మండలంలోని చించోలి(బి), ధని , ఆలూరు, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల పదవ తరగతి విద్యార్థుల కోసం కాంప్లెక్స్ పరిధిలో ప్రత్యేకంగా ప్రేరణ అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. పదవ తరగతి విద్యార్థులు పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని మధ్యాహ్నం 2 గంటల నుండి 5 గంటల వరకు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మోటివేషనల్ స్పీకర్ మునీందర్ రాజు, కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్, విద్యార్థులకు లక్ష్యసాధన, సమయ నిర్వహణ, పరీక్షా సిద్ధత, మానసిక ధైర్యం వంటి అంశాలపై స్ఫూర్తిదాయక ప్రసంగం చేశారు. "పట్టుదల, ప్రణాళిక, ప్రతిరోజు పునశ్చరణే విజయానికి మార్గం" అని ఆయన పేర్కొన్నారు. అనంతరం సబ్జెక్ట్ నిపుణులు ఉషాకిరణ్,శంకర్, రవిరాజు,మజీద్, మహేశ్వర్, వెంకట్రావు,సునీత, సంతోషీ మాత, వారి వారి సబ్జెక్టులకు సంబంధించిన ముఖ్యమైన అంశాలు,

బిట్ పేపర్ విధానం, రివిజన్ టెక్నిక్స్, ఎక్కువ మార్కులు సాధించడానికి అవసరమైన సూచనలు వివరంగా తెలియజేశారు. విద్యార్థులు ఆసక్తిగా పాల్గొని సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులను ఉత్తేజపరిచే విధంగా సలహాలు అందించారు. పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

# డ్రైవర్లకు దృష్టిలోపంతోనే ప్రమాదాలు



రాజన్న సిరిసిల్ల ::అమృత్ తెలంగాణ: వైద్య శిబిరంలోఎస్పి మహేష్ బిగితేనవ తెలంగాణ రాజన్న సిరిసిల్లగత ఏడాది రాజన్న సిరిసిల్ల జిల్లాలో 370 రోడ్డు ప్రమాదాలు జరిగాయని, ఈ ప్రమాదాల్లో 80 శాతం మంది చనిపోయారని, డ్రైవర్లకు దృష్టిలోపం ఉండడంతోనే ఈ ప్రమాదాలు జరిగాయని నిర్ధారణ జరిగినట్లు ఎస్పీ మహేష్ బిగితే పేర్కొన్నారు.సిరిసిల్ల పోలీస్ స్టేషన్ లో రాజన్న సిరిసిల్ల పోలీస్ ల ఆధ్వర్యంలో వాహనాల డ్రైవర్లకు శనివారం జరిగిన ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమంలో ఎస్పి మహేష్ బిగితే పాల్గొని మాట్లాడుతూ రెండు సెకండ్లలో ప్రమాదం గుర్తించినట్లయితే డ్రైవర్లు ప్రమాదం నుంచి బయట పడవచ్చని దృష్టిలోపం ఉండటంతోనే ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని దీంట్లో భాగంగానే డ్రైవర్లకు కంటి పరీక్షలు పోలీస్ ఆధ్వర్యంలో ఉచితంగా నిర్వహించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు ఆరు మాసాలకు ఒకసారి తప్పనిసరి కంటి పరీక్షలు చేయించుకోవాలని, వాహనాలు నడిపే డ్రైవర్లు బాధ్యతగా ఉండాలని అనేకమంది వాహనాల్లో ప్రయాణిస్తుంటారని వారికి ఎలాంటి ప్రమాదం జరగవద్దంటే డ్రైవర్ల కండ్లు బాగుండాలని ఆయన అన్నారు జనవరి మాసం నుంచి జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు ఏర్పాటు చేశామని జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో కంటి వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తామని, జిల్లా కలెక్టర్ తో మాట్లాడి ఉచితంగా కళ్లద్దాలు ఇప్పిస్తామని ఎస్పీ అన్నారు. కంటి వైద్య శిబిరాలను జిల్లా ఎస్పీ మహేష్ బిగితే ప్రారంభించారు ఈ కార్యక్రమంలో డిఎస్పి కత్రోజు నాగేంద్ర చారి, సీఐ కృష్ణ, ఎస్సైలు శ్రీకాంత్, వినీత రెడ్డి, ట్రాఫిక్ ఎస్ఐ దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు



కుభీర్ :అమృత్ తెలంగాణ: జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలను మండల కేంద్రమైన కుభీర్ తో పాటు పార్డి(బి) లోని ఎల్ బి ఎం పాఠశాల డోడర్నా ఆశ్రమ గిరిజన పాఠశాలలో పల్సి ప్రభుత్వ ఉన్నత పాఠశాల కస్తూర్బా గాంధీ విద్యాలయం లో శనివారం సైన్ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. మండలంలో ఆయా గ్రామంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో సివి రామన్ చిత్ర పటానికి పూజలు పూల మాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులు రూపొందించిన వివిధ ప్రయోగాలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులు క్యూజ్ పోటీలు, వ్యాసరచన పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు భౌమతులను ప్రధానం చేశారు. సైన్స్ డే సందర్భంగా పలు పాఠశాల సైన్స్ ఉపాధ్యాయులకు విద్యార్థులు శాలువా పూలమాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు ఉన్నారు.

# కుల చిచ్చులో బలైన చిన్నారికి కొవ్వొత్తులతో నివాళులు

రామగిరి :అమృత్ తెలంగాణ: పెద్దపల్లి జిల్లా రజక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి కల్వచర్ల గ్రామంలో కుల వివక్ష కారణంగా ప్రాణాలు కోల్పోయిన రెండేళ్ల చిన్నారికి మృతికి నిరసనగా క్ వొత్తులతో ర్యాలీ నిర్వహించి నివాళులు అర్పించారు. సర్పంచ్ రేండ్ల శారద కుమారస్వామి సంఘం నాయకులు, గ్రామస్థులు పాల్గొని చిన్నారి మృతిపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి అమానుష ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో రజక సంఘం అధ్యక్షుడు కన్నాల సంపత్, నాయకులు కంది శ్రీనివాస్, కంది శంకర్, మొండయ్య, కంది కిష్టయ్య, దండు సంపత్, రాజయ్య, దొడ్డిపేట కనకయ్య, సారయ్య, కంది రమేశ్,మహేష్, బీసీ సంఘం నాయకులు బూస కనకయ్య, రేండ్ల కుమారస్వామి,బూస అజయ్,ఎస్సీ నాయకులు బొంకూరి పోషం, ఆసం తిరుపతి, రాసమల్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# బొద్దింకలతో నిండిన గదిలో జాన్వీ బంధిఖానా



బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో క్షణం తీరిక లేకుండా ఉంది జాన్వీ కపూర్. ఈ యంగ్ బ్యూటీ నటించిన మిలీ ఎట్టకేలకు నవంబర్ 4న పెద్ద తెరపైకి వచ్చింది. పాజిటివ్ సమీక్షలతో మిలీ బాక్సాఫీస్ వద్ద బాగానే రాణించిందని ట్రేడ్ వెల్లడించింది. మత్తుకుట్టి జేవియర్ దర్శకత్వం వహించిన ఈ సర్వైవల్-థ్రిల్లర్ లో సన్నీ కౌశల్ - మనోజ్ పహ్వా కూడా ప్రధాన పాత్రలు పోషించారు. ఇది మలయాళ భాషా చిత్రం హెలెన్ కి రీమేక్. ఈ సినిమాని జాన్వీ తండ్రి బోనీకపూర్ స్వయంగా నిర్మించడం ఆసక్తికరం. పాపా బోనీ నిర్మాతగా మొదటి సహకారం జాన్వీకి చాలా ప్రత్యేకమైనది. తన స్పెషల్ సర్వైవల్ డ్రామాను ప్రచారం చేస్తూ తాజాగా జాన్వీ చెప్పిన ఓ సంగతి యువతరంలో హాట్ టాపిగ్గా మారింది. తాను బొద్దింకలతో నిండిన గదిలో ఎందుకు బంధించబడాలనుకుంటోందో జాన్వీ ఈ ఇంటర్వ్యూలో వివరించింది. ఒకవేళ బొద్దింకలతో నిండిన గదిలో బంధించబడితే లేదా మిలీ సినిమాలో లాగా ఫ్రీజర్ లో బంధించబడితే..? ఈ రెండిటిలో ఏది బెస్ట్.. మీరైతే ఏం చేస్తారు? మీ ఫీలింగ్ ఏంటీ? అంటూ హోస్ట్ జాన్వీ కపూర్ ని సరదాగా ప్రశ్నించారు. దానికి జాన్వీ ఆసక్తికర సమాధానం ఇచ్చింది. నేను ఫ్రీజర్ లోకి తిరిగి వెళ్లలేను. నేను బొద్దింకలతో నిండిన గదిలో బంధించబడితేనే బెటర్ అని చెప్పింది. ఫ్రీజర్లో ఉండటం చాలా కష్టంగా ఉందని కూడా జాన్వీ తెలిపింది. జాన్వీ కపూర్ మిలీ కథాంశం ఆసక్తికరం. ఒక ప్రముఖ ఫాస్ట్ ఫుడ్ ఫ్రాంచైజీలో వెయిటర్ గా పనిచేసి 48 గంటలకు పైగా ఫ్రీజర్ లో బంధించబడిన ఒక అమ్మాయి కథేమిటన్నది తెరపై చూపించారు.

# మరోసారి బోల్డ్ గా ఒంపుల్ని ప్రదర్శించిన ఇషా




టాప్ మోడల్ కం నటి ఇషా గుప్తా పరిచయం అవసరం లేదు. గ్లామర్ షో విషయంలో హద్దులు చెరిపేసి చెలరేగడం ఈ సీనియర్ బ్యూటీ ప్రత్యేకత. ఇన్ స్టా వేదికగా ఇషాగుప్తా ఎప్పటికప్పుడు చెలరేగి అందాలు ఆరబోస్తుంది. తాజాగా ఇషా షేర్ చేసిన బోల్డ్ ఫోటోషూట్ అంతర్జాలంలో దుమారం రేపుతోంది. ఇషాజీ మరోసారి తనదైన శైలిలో చెలరేగారు. ఈషా గుప్తా జెన్నీ ప్యాక్ మన్ ప్లాటినం గ్రే సీక్విన్డ్ గౌలో వజ్రంలా మెరుస్తోంది. ఫ్లోర్-లాంగ్ గౌనులో త్రీక్వార్టర్ లెంగ్త్ డ్రాప్డ్ స్లీవ్ లో గ్లామర్ ని ఆవిష్కరించిన తీరు కుర్రకారుకు మైండ్ బ్లాక్ చేస్తోంది. మోడల్ కం నటి పర్యావరణవేత్త అయిన ఈషా గుప్తా నటిగా ఇప్పటికే బాలీవుడ్ లో తనదైన ముద్ర వేసింది. తిరుగులేని ఎనర్జీతో స్టైల్ ఐకాన్ గా వెలుగులు విరజిమ్ముతోంది. తన స్టైల్ పై రెగ్యులర్ అప్ డేట్ లతో ఈషా ఇప్పటికే 13 మిలియన్లకు పైగా ఇన్ స్టాగ్రామ్ ఫాలోవర్ల ఫాలోవర్ లను సంపాదించింది. ఈషా గుప్తా నిరంతర ఫ్యాషన్ సెన్స్ పై నేటితరంలో డిబేట్లు సాగుతుంటాయంటే అర్థం చేసుకోవాలి. తాను ఎంచుకున్నది ఎత్నిక్ వేర్ అయినా... ఆరు గజాల పవిట కొంగుతో చీరలో అయినా.. అందమైన గౌనులో అయినా తన డ్రెస్సింగ్ సెన్స్ నుంచి కళ్లు తిప్పుకోవడం అంత ఈజీ కాదు. ఈషా గుప్తా జెన్నీ ప్యాక్ మన్ ప్లాటినం గ్రే సీక్విన్డ్ గౌలో ఒంపులు రంగరించిన తీరుపై చర్చా సాగుతోంది. ఇషాజీ ఫ్యాషన్ ప్రపంచపు మహారాణి. రక రకాల ఫ్యాషన్ దుస్తులకు స్టైలింగ్ చేస్తూ మోడల్ గా అదరగొడుతుంటుంది. తన ఇన్ స్టాగ్రామ్ ఫోటోలలో ప్రయోగాలతో పాటు కాలానుగుణ వస్త్రధారణలతో తన ఆసక్తిని తరచుగా ప్రదర్శిస్తుంది. తళతళా మెరిసే దుస్తులతో ప్రతిసారీ డ్రీమ్ గాళ్ ని తలపిస్తుంది. మెరిసే గౌనులో ఈషా మరోసారి కళ్ళు తిప్పుకోనివ్వని ట్రీటిచ్చింది. ఈసారి జెన్నీ ప్యాక్ మన్ రాక్ ల నుండి ప్లాటినం గ్రే గౌనును ఎంచుకుంది. ఆమె ఫ్లోర్-లాంగ్ గౌనులో త్రీక్వార్టర్ లెంగ్త్ డ్రెప్డ్ స్లీవ్ తో ఆకట్టుకుంది. స్ట్రెయిట్ హెయిర్ నిగనిగల అందాలతో మెరిపించింది ఇషా. ఇషా గుప్తా టాలీవుడ్ కి సుపరిచితం. కానీ ఇక్కడ నటించేందుకు ఎక్కువ ప్రాధాన్యతనివ్వలేదు. రామ్ చరణ్ వినయ విధేయ రామాలో హాట్ ఐటమ్ నంబర్ తో కట్టి పడేసినా ఆ తర్వాత కనిపించలేదు. 'జన్నత్' సినిమాతో బాలీవుడ్ లో లాంచ్ అయింది. ఆ తర్వాత అక్కడ బాగానే అవకాశాలు వస్తున్నాయి. కాలేజ్ డేస్ నుంచి సినిమాలంటే ఆసక్తి. దీంతో ఈషా మోడలింగ్ రంగంలోకి అడుగు పెట్టింది. ఆ తర్వాత ఎన్నో అందాల పోటీల్లో పాల్గొంది. ఫెమినా మిస్ ఇండియా పోటీల్లోనూ నెగ్గింది. చివరిగా బాలీవుడ్ లో నటిగా స్థిరపడింది. ప్రస్తుతం ప్రపంచ సుందరి పోటీలకు ఎంపికయ్యే మోడల్స్ కి ఇషా జీ శిక్షణను అందిస్తున్నారు. ఫెమీనా మిస్ ఇండియా జడ్జిగానూ ఇషా కు చాలా అనుభవం ఉంది. ఇటీవల బాబీ డియోల్ తో కలిసి 'ఆశ్రమ్ సీజన్ 2'లో ఈషా చివరిగా కనిపించింది. పలు భారీ చిత్రాలకు ఇషా గుప్తా సంతకాలు చేసింది. వాటి వివరాలు వెల్లడి కావాల్సి ఉంది.

# మల్లె చెండు ఒళ్లంతా చుట్టుకుని కలకలం రేపిన నటి

అందుకే రాగిణి ద్వివేది ఉగాది స్పెషల్ ఫోటోషూట్ తో అభిమానుల ముందుకు వచ్చింది. కొత్తొక వింత పాతొక రోత! పాత సంవత్సరానికి భాయ్ చెప్పి కొత్త సంవత్సరానికి వెల్ కం చెప్పింది కన్నడ నటి రాగిణి ద్వివేది. ఉగాది ఫర్వదినాన్ని పురస్కరించుకుని ఇదిగో ఇలా కొత్తగా కొంగొత్తగా తనని తాను పరిచయం చేసుకుంది. గతాన్ని తలుచుకుని సమయాన్ని వృథా చేసేందుకు రాగిణి సిద్ధంగా లేదు. భవిష్యత్ గురించి మాత్రమే ఆలోచిస్తోంది. అందుకే రాగిణి ద్వివేది ఉగాది స్పెషల్ ఫోటోషూట్ తో అభిమానుల ముందుకు వచ్చింది. ఇదిగో ఇలా మల్లె చెండును ఒంటికి చుట్టుకుని, జరీ అంచు బంగారు వర్ణం సిల్కు చీరలో దేవతా సుందరిలా మెరిసిపోతోంది. అలా పానుపుపై జేరబడి, మల్లెలను ముంజేతికి కట్టుకుని సువాసన పీలుస్తూ, అసలు రాగిణి ఇచ్చిన ఫోజ్‌లు కుర్రకారులో కలకలం రేపుతున్నాయి. పానుపుపై బంతిపూల దండల మధ్య రాగిణి రసరమ్యంగా మెరిసిపోతోంది. ఒక కొత్త సంవత్సరం, ఒక కొత్త అధ్యాయం - దానిని ఆశ - దృఢ సంకల్పంతో స్వీకరించండి! ప్రతి సూర్యోదయం ఒక కొత్త అవకాశాన్ని తెస్తుంది - దీనిని అద్భుత ప్రారంభంగా చేసుకోండి!




# మళయాళ భామ 'కుమారి'గా వస్తుంది..!



మళయాళంలో తన నటతో మెప్పిస్తూ వస్తున్న ఐశ్వర్య లక్ష్మి ఈమధ్య తమిళ సినిమాల్లో కూడా సందడి చేస్తుంది. తెలుగులో గాడ్సే సినిమాతో తెలుగు తెరకు పరిచయమైంది ఐశ్వర్య లక్ష్మి. రీసెంట్ గా పొన్నియిన్ సెల్వన్ 1 సినిమాతో కూడా అమ్మడు ఆకట్టుకుంది. సినిమాలో తన పోర్షన్ వరకు అదరగొట్టేసింది ఐశ్వర్య. సినిమాలే కాదు ఓటీటీ వెబ్ సీరీస్ లతో కూడా ఆడియన్స్ ని అలరిస్తుంది అమ్మడు. ఇటీవలే అమ్ము అంటూ ఓ తెలుగు వెబ్ సీరీస్ తో వచ్చిన ఐశ్వర్య లక్ష్మి ఆ సినిమాతో ప్రశంసలు అందుకుంది. ఆ మూవీ తర్వాత కొద్దిపాటి గ్యాప్ తోనే మరో మూవీతో వస్తుంది ఐశ్వర్య. ఈసారి కుమారి అంటూ ఒక మైథలాజికల్ ఫాంటసీ మూవీతో వస్తుంది. ఈ మూవీని నిర్మల్ సహదేవ్ డైరెక్ట్ చేశారు. నెట్ ఫ్లిక్స్ లో ఈ సినిమా నవంబర్ 18 శుక్రవారం రిలీజ్ అవుతుంది. అమ్ము సినిమాతో ఒక ఇంప్యాక్ట్ క్రియేట్ చేసిన ఐశ్వర్య లక్ష్మి కుమారితో కూడా అలరిస్తుందని అంటున్నారు. ఇప్పటికే నెట్ ఫ్లిక్స్ లో వస్తున్న కుమారి మూవీ టీజర్ ట్రైలర్ ఈ సీరీస్ పై ఆసక్తి కలిగించాయి. థియేటర్ లోనే వస్తేనే కాదు తమకు నచ్చిన కంటెంట్ ఎక్కడ రిలీజైనా సరే చూసేస్తున్నారు ప్రేక్షకులు. ముఖ్యంగా సినిమా టికెట్ల రేట్లు పెరగడం.. అంత ఖర్చు పెట్టి సినిమా చూసినా నిరాశపరచడం లాంటి కారణాల వల్ల థియేటర్ లో సినిమాలు చూసేందుకు ఆసక్తి చూపట్లేదు. అందుకే ఓటీటీలకు ఎక్కువ డిమాండ్ పెరిగింది.భాషతో సంబంధం లేకుండా ఓటీటీ లో వెరైటీ కంటెంట్ ఉంటే చాలు ప్రేక్షకులు విరగబడి చూసేస్తున్నారు. వెండితెర మీద అద్భుతాలు చేయాలని అనుకున్న ఔత్సాహిక కళాకారులకు కూడా ఈ ఓటీటీల్లో మంచి అవకాశాలు వస్తున్నాయి. అందుకే ఈమధ్య ఓటీటీల్లో మంచి మంచి కంటెంట్ సినిమాలు వస్తున్నాయి. తెలుగులోనే కాదు ఇతర భాషల సినిమాలు వెబ్ సీరీస్ లు కూడా మన ప్రేక్షకులు చూస్తున్నారు.

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309,
ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- singidiamruth404@gmail.com